కథ

# చేదుపాట

పి. చంద్రశేఖర ఆజాద్
92465 73575

అతని కళ్లు మూతబడటం లేదు. దట్టమైన అడవి. ఒక్కసారిగా వాతావరణం స్తంభించినట్లు అనిపించింది. అతనిలో రకరకాల ఆలోచనలు సుడులు తిరుగుతున్నాయి. అప్పుడు కొమ్మలు కదిలాయి. ఉలిక్కిపడి పడుకున్నవాడల్లా లేచి కూర్చున్నాడు. అనుమానంగా ఆ చీకట్లో కళ్లు చిట్లించి చూస్తున్నాడు. దూరంగా తమ దళ సభ్యులు ఆదమరిచి నిద్రపోతున్నారు. అందులో ఓ వ్యక్తి మాత్రం.. నిద్రపోకుండా అప్రమత్తంగా ఉన్నాడు.

చల్లటి గాలి వీయడం మొదలైంది. గాలి పాటను మోసుకొస్తున్నట్లు అతనికి అనిపించింది. అవును పాట. పదునెక్కిన పాట! అతని మనసు గతంలోకి పరుగులు తీసింది.

* * *

అదో మారుమూల గ్రామం.

అక్కడికింకా అభివృద్ధి అనేది ప్రవేశించలేదు. అక్కడ అన్ని వృత్తులవారూ ఇంకా వాటినే నమ్ముకుని బతుకుతున్నారు. అరకొరగానే ఆదాయాలు. అక్కడ ప్రకృతి అందాలు ఉన్నాయి. అతనికి చిన్నప్పటి నుంచీ పాట అంటే ప్రాణం. అది ఎప్పుడు మనసులో పుట్టిందో తెలియదు. అతను నోరు తెరిస్తే ఏదో రాగం బయటికి వచ్చేది. అది ఏ రాగమో అతనికి తెలియదు. అతను అక్కడి బడిలోనే అక్షరాలు దిద్దుకున్నాడు.

అక్షరాలకంటే అక్కడి చెట్లూ, చెలమలూ, మనుషులూ.. అతణ్ని పాటగాడిగా మలిచాయి. మొదటి రోజుల్లో సినిమా పాటలు పాడేవాడు. తర్వాత జానపద గీతాలు. అందులో శృంగారం, ఆ తర్వాత తత్వాలు పాడుకున్నాడు. అతని బతుకులోకి ఎన్నో పాటలు అలా వచ్చి, అతని మెదడు పొరల్లో నివాసం ఏర్పరుచుకున్నాయి.

బాల్యం కరిగిపోయింది. కౌమారం దారి విడిచింది. యవ్వనంలోకి అడుగుపెట్టాడు. అప్పుడు పరిచయం అయ్యారు కొందరు వ్యక్తులు.

“ఈ లోకం నిండా ఇన్ని అన్యాయాలు జరుగుతుంటే తత్వాలు పాడుతున్నావా?”.. అన్నప్పుడు అతని మనసులో తేనెతుట్టె కదిలింది.

“పాట మన ఆనందం కోసం కాదు. అది జనం కోసం కావాలి. ఇప్పటివరకు నువ్వు పాడిన పాటల చోటులో నువ్వు కొత్త పాటలు రాయాలి. నువ్వు జనం నాలుకల మీద పాటగా మారిపోవాలి. రేపు నువ్వుండవు. నీ పాట మాత్రమే ఉంటుంది” అన్నారు.

అతను ఇల్లు విడిచిపెట్టాడు. దళంలో చేరిపోయాడు. అనంతమైన దరిద్రాన్ని, హింసను, అణచివేతను దగ్గరగా చూశాడు. అతనిలో పాట సరికొత్త రాగాలతో ఊపిరి పోసుకుంది. అయినా అతనికి రాగాలు తెలియవు. రాగాలన్నీ అతని పాటలో నిక్షిప్తం అయ్యాయి.

అతనికి అంతకు ముందు అమ్మానాన్నలు పెట్టిన పేరు ఉంది!

“ఈ రోజు నుంచి నీ పేరు మారుస్తున్నాం” అన్నారు.

అతను ఆందోళనగా చూశాడు. అతనికి అమ్మానాన్నలు గుర్తుకు వచ్చారు.

“ఇక్కడ మనకు ఉద్యమం ప్రధానం. ఇందులో పని చేసేవారికి ఒక్క పేరు మాత్రమే ఉండదు. అనేక పేర్లు ఉంటాయి. మనం జయించాల్సినవి చాలా ఉన్నాయి. మనం వ్యక్తిగత ఆస్తిలేని సమాజం కోసం యుద్ధం చేస్తున్నాం. మనకు కుటుంబం లేదు. జగమంత కుటుంబం మనది. మనకు అనుబంధాలు అడ్డంకి. మనకు సహచరులు, జనం మాత్రమే.. స్నేహితులైనా, ప్రాణమైనా. మనం ఇప్పుడు వ్యక్తులం కాదు. వ్యక్తులుగా మన అస్తిత్వాన్ని మనం వదులుకున్నాం. ‘నేను’ అంటే మన ఉద్యమం. మన సంస్థ. అంతకుమించి ఎలాంటి కీర్తి కాంక్షలు మనల్ని తాకకూడదు. నేను అంటే సమూహం. ఇది ప్రతిక్షణం మనల్ని హెచ్చరించే ఆయుధం కామ్రేడ్!”.

కాలం పరుగులు తీస్తున్నది. నిరంతరం ప్రయాణం. ఆట నుంచి పాట వరకు, వాటినుంచి రకరకాల ఆచరణల వరకు.

* * *

అతను ఎప్పటికో ఓ రాత్రి అతని గ్రామం చేరుకున్నాడు. అప్పుడు అమ్మానాన్నలను చూడాలనుకున్నాడు. జన్మనిచ్చిన వారు. ఎవరికీ చెప్పకుండా ఓ రోజు మాయమయ్యాడు. అలా చేసింది తను మాత్రమే కాదు. ఎందరో యువతీ యువకులు. తల్లిదండ్రులను కలవడానికి దళం అంగీకరిస్తుంది. అతను మాత్రం తను బంధాలకు బానిస అవుతానేమో అనుకున్నాడు. బలవంతాన తనను తాను నిగ్రహించుకున్నాడు.

అతను ఊర్లోకి అడుగుపెట్టగానే ఒక్కసారిగా అతణ్ని పాటలు చుట్టుముట్టాయి. అందులో అతను విన్న, పాడిన అన్ని రకాల గీతాలు ఉన్నాయి. అతని దగ్గర ఓ డైరీ ఉంటుంది. అందులో అతను పాటలు రాసుకుంటాడు. వందల కొద్దీ పల్లవులు, చరణాలు ఉంటాయి. అందులో కొన్ని ప్రేమగీతాలు ఉంటాయి. అలాగే ప్రకృతి మీద ప్రేమతో రాసుకున్న పాటలు ఉంటాయి. ఎప్పుడన్నా ఏకాంతంలో ఉన్నప్పుడు..

‘నేను పాటకు దూరం అయ్యానా? నాలో అనేక ఉద్వేగాలు ఉన్నాయి కదా! అవన్నీ చంపుకొని కేవలం ఓ తరహా పాటలకు పరిమితం అయ్యానా!?’ అనిపిస్తుంటుంది. అంతలోనే కర్తవ్యం ముందుకు వస్తుంది.

ఈ ప్రయాణంలో అతనికి ఆమె కలిసింది. ఆమెకు కూడా కొన్ని పేర్లున్నాయి. ఆమె అతని కంటే ఎక్కువ చదువుకుంది. మంచి కవిత్వం రాస్తుంది. వారి చేతిలో కలాలు మాత్రమే కాదు.. ఆయుధాలు కూడా ఉంటాయి. ఆ కవిత్వంలోనూ అనేక రకాల ఆలోచనలు. ప్రేమ, కలలు, కొత్త సమాజం, సౌందర్యం.

“వీటినుంచి దూరంగా పారిపోవడం సాధ్యం కాదు” అన్నదామె.



‘నమస్తే తెలంగాణ, ముల్కనూరు ప్రజాగ్రంథాలయం’ సంయుక్తంగా నిర్వహించిన ‘కథల పోటీ-2022’లో రూ.2 వేల బహుమతి పొందిన కథ.